ఉదయించిన జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 09 మార్చి 2023
1

రాగి జావా పంపిణీ చేసిన ఎంఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఆదిలాబాద్ రూరల్, అర్బన్, మావల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ జయశీల రాగి జావా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయం పోషకాహార పానీయంగా రాగి జావా అందిస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాగి జావా పదార్థాలు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం పిల్లలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నవతెలంగాణ-దిలావర్‌పూర్



నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన బొమ్మెన సంగీత-శ్రీనివాస్ పెద్ద కుమార్తె బొమ్మెన లక్ష్మి ప్రసన్న(19) మంగళవారం రాత్రి అదృశ్యమైంది. ఏఎస్ఐ పి.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..రోజూలాగే మంగళవారమూ భోజనం చేసి పడుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో యువతి మంచంపై లేకపోయే సరికి ఆందోళన చెందారు. చుట్టు పక్కల, బంధువులకు ఫోన్ చేసి ఆచూకీ కోసం యత్నించారు. అయినా జాడ దొరకలేదు. ఎక్కడికెళ్లిందో తెలియని పరిస్థితుల్లో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో కూతురు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. యువతి జిల్లా కేంద్రంలోని జీఎస్ఆర్ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది.

వారికి రైతుబంధు ఎప్పుడు..?

- ఇంకా ఖాతాలకు చేరని యాసంగి డబ్బులు
- నెల రోజులుగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- ఎప్పుడొస్తుందో స్పష్టతనివ్వని అధికారులు
- కొత్తవారికీ దక్కని ప్రభుత్వ పెట్టుబడి సాయం

అన్నదాతలకు ఆదరువుగా ఉన్న పెట్టుబడి సాయం ఇంకా కొందరు రైతుల దరి చేరడం లేదు. యాసంగి సీజన్‌లో ప్రభుత్వం అందజేసిన రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 10 ఎకరాలు కలిగిన వారితో పాటు 11, 12 ఎకరాలు కలిగిన కొందరికీ ఈ సాయం అందడం లేదు. ఈ సాయం ప్రారంభమై నెల రోజులు గడుస్తుండటం.. మిగతా అందరికీ వారి ఖాతాల్లో డబ్బులు జమ కావడం..కొందరికి మాత్రమే రాకపోవడంతో ఎందుకు రావడం లేదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో పది ఎకరాలకు పైగా కలిగిన వారిలో కొందరికి వచ్చి మరికొందరికి రాకపోవడంతో ఆ డబ్బులు వస్తాయా రావా అనేది అంతుచిక్కడం లేదు. రైతుల వివరాలన్ని తాము పంపించామని ప్రభుత్వం విడతల వారీగా ఖాతాల్లో జమ చేస్తుందని అధికారులు చెబుతున్నా..ఎప్పటిలోగా వస్తాయో మాత్రం చెప్పడం లేదు. దీంతో అర్హులైన అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



పంట సాగు కోసం దళారులను ఆశ్రయించి అప్పులపాలవుతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చింది. రైతుకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5వేల చొప్పున వానాకాలం, యాసంగి సీజన్లలో అందజేస్తోంది. ఏడాదికి ఎకరానికి రూ.10వేల చొప్పున అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రతి ఏటా వానాకాలం సీజన్ ప్రారంభంతో.. మరో దఫా యాసంగి సీజన్ మొదట్లో ఈ సాయాన్ని అందజేస్తోంది. ప్రభుత్వం ఈ సాయం అందజేసినప్పటి నుంచి అన్నదాతలు అప్పుకోసం దళారులను ఆశ్రయించడం మానేశారు. ప్రభుత్వం అందించే ఈ సాయంతో పంటలు సాగుచేస్తూ ప్రయోజనం పొందుతున్నారు. కానీ ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో అందరికీ రైతుబంధు సొమ్ము అందజేసిన ప్రభుత్వం యాసంగిలో మాత్రం కొందరిని విస్మరించింది. ఆదిలాబాద్ జిల్లాలో 1,46,606మందికి పట్టాపాసు పుస్తకాలు ఉండగా వీరికి ఎకరానికి రూ.5వేల చొప్పున రూ.265కోట్లు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 1,44,230మంది రైతుల ఖాతాల్లో రూ.237కోట్లు జమ చేయగా ఇంకా రూ.12.28కోట్లు జమ చేయాల్సి ఉంది. రైతుబంధు సాయం అందని వారిలో పది ఎకరాలు, ఆ పైన కలిగిన వారు ఉండటం గమనార్హం.

కొత్త వారికి దక్కని సాయం..!

ప్రతి ఏటా భూముల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఒకరి నుంచి మరొకరికి పట్టాల మార్పిడి జరుగుతుంటాయి. ఈ క్రమంలో కొత్తగా పట్టాలు పొందిన వారు ఈ రైతుబంధు సాయం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. క్లస్టర్ పరిధిలో ఉండే వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు అందజేస్తే వాటిని సంబంధిత అధికారులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ నుంచి ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా 3800మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. కానీ రైతుబంధు పోర్టల్ తెరుచుకోకపోవడంతో కొత్త వారికి పెట్టుబడి సాయం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ప్రతి ఏటా కొత్తగా దరఖాస్తులు చేసిన వారికి రైతుబంధు సాయం అందగా.. ఈ ఏడాది మాత్రం రాకపోవడంతో కొత్త రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఇలాంటి వారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా సుమారు 10వేల మంది వరకు ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతుబంధు సాయం దక్కకపోవడంతో పంట సాగుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.

విడుతల వారీగా విడుదలవుతాయి : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాలోని రైతులందరి వివరాలను ప్రభుత్వానికి అందజేశాం. ఇది వరకే చాలా మంది రైతులకు రైతుబంధు సాయం వారి ఖాతాల్లో జమ అయింది. మిగిలిన వారికి కూడా త్వరలోనే ఖాతాల్లో జమ అవుతాయి. పోర్టల్ ప్రారంభం కాగానే కొత్త వారికి పెట్టుబడి సాయం వచ్చే అవకాశం ఉంది.

పెగడపల్లికి పొంచి ఉన్న ముంపు ముప్పు



నవతెలంగాణ-జైపూర్

2వేల మెగావాట్ల ప్లాంట్‌గా విస్తరించబోతున్న సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో పెగడపల్లి గ్రామం ముంపుకు గురవుతుందని విశ్వసనీయంగా తెలుస్తోంది. ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో సుమారు 2వేల ఎకరాల భూములను పెగడపల్లి, గంగిపల్లి, జైపూర్, ఎల్కంటి నుండి సేకరించగా ప్లాంట్ విస్తరణలో భాగంగా పెగడపల్లి గ్రామాన్ని తరలించే అవసరం ఏర్పడుతున్నట్లు సమాచారం. ఇప్పుడున్న 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ అనుబంధంగా మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు సంస్థ ఇదివరకే ప్రకటించింది. ఈ క్రమంలో అదనంగా ఏర్పాటు చేయబోతున్న 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణంపై దృష్టి సారించింది. ప్లాంట్ విస్తరణలో భాగంగా సమీపంలో గల పెగడపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి గ్రామాన్ని తరలించేందుకు సంస్థ సమాలోచనలు చేస్తున్నట్లు తెల్సింది. ప్రభుత్వ పరంగా అనుమతుల విషయమై ఇటీవల చర్చించిన సింగరేణి అధికారులు తదుపరి చర్యలను ముమ్మరం చేసినట్లు తెలిసింది. కొత్త ప్రాజెక్టులు, గనుల విస్తరణకు సంబంధించి భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతూ సమస్యలు పరిష్కరించుకోవాలని పలు సందర్భాల్లో సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడున్న విద్యుత్ ప్లాంట్ ఆవరణలో అదనంగా మరో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ పరమైన అనుమతులు అందినట్లు గతంలో సీఎండీ ప్రకటించారు. 2వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్‌తో పాటు 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న యోచనతో సంస్థ ముమ్మరమైన చర్యలు చేపట్టింది.

సాధికారత దిశగా అడుగులు వేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్న ఈ ఆధునిక యుగంలో సాధికారత సాధించే దిశగా అడుగులు వేయాలని టిఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ అన్నారు. బుధవారం పట్టణంలోని డైట్ కాలేజీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నిజ జీవితంలో శాస్త్రీయ అలవాట్లను అమలు చేయడం ద్వారా మహిళలు తమ కుటుంబాలను వాస్తవిక ప్రపంచంలోకి నడిపించాలని కోరారు. మహిళా సాధికారత అంటే ఏమిటో యూటీఎఫ్‌ను చూస్తే అర్థమవుతోందని జిల్లా విద్యాశాఖాధికారి టి ప్రణీత అన్నారు. మహిళలు ఉన్నత పదవులు అధిరోహిస్తే ఆ సమాజం బాగుపడుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన అన్నారు. ఈ కార్యక్రమానికి టిఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ సురేఖ అధ్యక్షత వహించారు. సామాజిక బాధ్యత కలిగిన సంఘంలో పనిచేస్తున్నందుకు తాము గర్వపడుతున్నామని ఆమె అన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ కోసం ఎల్లవేళలా కృషి చేయడమే తమ లక్ష్యమని ఐద్వా కార్యదర్శి జమున అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ స్వామి, ప్రధాన కార్యదర్శి వి అశోక్, జిల్లా కార్యదర్శి ఇ శివన్న, సోషల్ మీడియా కన్వీనర్ కె శంకర్, మహిళా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఐద్వా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ కల్లు తాగి గిరిజన యువకుడు మృతి

నవతెలంగాణ-ఉట్నూర్



హోలీ సంబరాల్లో భాగంగా కల్తీ కల్లు తాగి గిరిజన యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చేటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..చిన్ననంద్యగూడ గ్రామానికి చెందిన ఆత్రం మోహబత్‌రావ్(27) హోలీ సంబరాల్లో పాల్గొన్నాడు. రాత్రి లక్కారం గ్రామానికి చెందిన కిష్టాగౌడ్ ఇంటికి తెల్లకల్లు తాగేందుకు వెళ్లొచ్చాడు. ఇంటికి రాగానే కిందపడిపోయాడు. ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్యాంట్ పాకెట్లో తెల్లకల్లు ప్యాకెట్ గుర్తించారు. బుధవారం కిష్టాగౌడ్ నివాసానికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. భయంతో కిష్టాగౌడ్ కుటుంబ సభ్యులు లోపలే ఉండిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తెల్లకల్లులో ఉపయోగించే వివిధ రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. కిష్టాగౌడ్‌ను ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్సై భరత్ సుమన్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ఏజెన్సీలో కల్తీ కల్లును అరికట్టాలి

కల్తీ కల్లును ఏజెన్సీలో అరికట్టాలని ఆదివాసీ సంఘాల నాయకులు, మత్తడిగూడ ఉప సర్పంచ్ ఆత్రం తిరుపతి డిమాండ్ చేశారు. కల్తీ కల్లు తాగి ఇది వరకే గ్రామంలో ముగ్గురు చనిపోయారని గుర్తు చేశారు. అయినా నివారణకు ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కల్తీ కల్లును అరికట్టి మరణాలు పునరావృతం కాకుండా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కొవ్వొత్తుల ర్యాలీ



నవతెలంగాణ - జైనూర్

సీనియర్ వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న డాక్టర్ ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ దయాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కుమురం భీం చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు పలు సంఘాల నాయకులతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళను ఉన్నత చదువు చదివించేందుకు తల్లిదండ్రులు ఎంతో కృషి చేస్తున్నా వారిపై ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళనకరమన్నారు. ర్యాగింగ్ భూతానికి, కుల వ్యవస్థకు బలైన ఆడబిడ్డ డాక్టర్ దరావత్ ప్రీతి నాయక్ ఆత్మకు చేకూరాలంటే కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనుక యాదవ్‌రావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అబూ తాలిబ్, నేతకాని రాష్ట్ర నాయకులు జాడి రవీందర్, ఆదివాసీ సంఘాల నాయకులు కనక గంగారాం, మైనార్టీ సంఘాల నాయకులు జుబేర్‌ఖాన్ పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త తాటి లక్ష్మణ్‌ను ఎమ్మెల్యే జోగు రామన్న బుధవారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకొని వెళ్లి అనారోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ అశోక్ స్వామి, కొండ గణేష్, కాళ్ల విఠల్, నల్ల మహేందర్ ఉన్నారు.

భక్తి మార్గాన్ని అనుసరించాలి

తాంసి : ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించడం మంచిదని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. బుధవారం పొన్నారి గ్రామంలో నూతనంగా ఆంజనేయ విగ్రహా ప్రతిష్టాపనలో భాగంగా యజ్ఞం, పల్లకి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐక్యతతో ఉండి ఏదైనా సాధ్యమే అన్నారు. గ్రామంలో ఇంత పెద్ద ఆంజనేయ విగ్రహం నిర్మించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ రేఖా రఘు, ఉపసర్పంచ్ అశోక్, నాయకులు సంజీవ్‌రెడ్డి, రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- పలుచోట్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మీ అన్నారు. జిల్లా కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తోందని తెలిపారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర అడబిడ్డలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నారని, మహిళలకు ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. దీనిలో భాగంగానే ప్రతి జిల్లా కేంద్రంలో సఖి సెంటర్‌ను ఏర్పాటు చేశారని, దీని ద్వారా సమస్యలతో సతమతమవుతున్న మహిళలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు వారి హక్కులను తెలుసుకొని వాటిని పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు, వయోవృద్ధులకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళా చట్టాలను గ్రామస్థాయిలో తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన లేకపోవడంతోనే తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, గ్రామాల్లో నేటికీ బాల్యవివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో కృషి చేసిన మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి మణెమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సావిత్రి, జిసిడివో శకుంతల పలువురు సిడిపిఓలు, సఖి కేంద్రం నిర్వాహకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకల్లో జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి పాల్గొన్నారు. మండలంలోని మహిళా ప్రజాప్రతినిధులను, సర్పంచ్‌లను సన్మానించి మహిళల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంగ, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మహిళా ఎంపీటీసీలు మేకల వనజ, దుర్గం నిర్మల, గోగుల సుశీల, సావిత్రి, సర్పంచులు చునార్కర్ లక్ష్మి, వరలక్ష్మి, మడావి సీత, ఎంపిఓ ప్రసాద్, సర్పంచులు భీమేష్, బాబురావు, నాయకులు పెంటయ్య, నిసార్ పాల్గొన్నారు. బాపునగర్‌లో నిర్వహించిన వేడుకల్లోనూ కోవ లక్ష్మి పాల్గొని కేక్ కట్ చేశారు. ఆమెను కాలనీవాసులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహిళ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని సావిత్రి, వైద్యురాలు అన్సారీ, గృహిణులు వరలక్ష్మి, స్రవంతి, సరిత, శైలజ, స్వప్న, లత పాల్గొన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ ఫయాజ్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కిరణ్ పాల్గొన్నారు. రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు రాజు, మహేష్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ ఎస్పీ క్యాంపు కార్యాలయంలో..

ఆదిలాబాద్‌టౌన్ : మహిళా సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పనితనాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ డి ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బుధవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని మహిళా ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో మహిళా దినోత్సవ వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా అధికారులకు వృత్తిపరంగా, సొంతంగా ఎటువంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు ఎల్లవేళలా జిల్లా పోలీస్ యంత్రాంగం అందుబాటులో ఉండి కచ్చితమైన సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు కార్యాలయాలలో విధులు నిర్వర్తించినప్పుడు మిగిలిన సిబ్బంది వివిధ రకాలైన కఠినమైన విధులకు హాజరయ్యేలా ఆస్కారం ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా మహిళలు పురుషులకు ఏమాత్రం తక్కువగా కాకుండా అన్ని అన్ని రకాల కష్టతర విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఓ బి శ్రీపాల్, సీసీ దుర్గం శ్రీనివాస్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, మహిళ ఎస్సైలు డి రాధిక, అంజమ్మ, పద్మ ఏఎస్ఐలు సునీత, అనిత, సవిత, కవిత, వెంకటమ్మ, మహిళా హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా అధికారులకు సత్కారం



ఆదిలాబాద్‌అర్బన్ : వ్యవసాయ శాఖలో మారుమూల ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ఉత్తమ సేవలందిస్తున్న మహిళా అధికారిణులను బుధవారం ఆ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. గుడిహత్నూర్‌కు చెందిన డి.రేవతి (ఎంఏఓ), గాదిగూడకు చెందిన జె.దివ్య(ఎంఏఓ), గుడిహత్నూర్ తోషం క్లస్టర్ డి. ప్రవంతి, నేరడిగొండ క్లస్టర్ ఈ.సౌజన్య(ఏఈఓ), జైనథ్ మండలం నిరాల క్లస్టర్ సుజాత (ఏఈఓ), ఆదిలాబాద్ డివిజన్‌కు చెందిన సి.పుష్పమాల(ఏడీఏ), ఆదిలాబాద్ ఎస్‌ఎమ్‌ఎస్ కృష్ణవేణి(డీఏ) సన్మానం పొందిన వారిలో ఉన్నారు.

మహిళలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-జన్నారం

మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే బిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ప్రజా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఈ ప్రజారోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా చికిత్సలు అందిస్తారన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ మహిళా దినోత్సవం రోజే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. కేంద్ర పరిధిలో పనిచేసే వైద్య సిబ్బందితో కలిసి మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూషణవేణి గంగాధర్‌గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సులువ జనార్ధన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు మహ్మద్ రియాజుద్దీన్, మహిళా అధ్యక్షురాలు మామిడి సుశీల పాల్గొన్నారు.

జైపూర్ : ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభించారు. గోదావరి తీర ప్రాంత గ్రామాలకు కుందారం ఆరోగ్య కేంద్రం ద్వారా ఆరోగ్య మహిళా కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇజ్జగిరి సమ్మయ్య, వైద్యురాలు శ్రావ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ రుణ యూనిట్లు పెంచాలి

నవతెలంగాణ - జైనూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు రుణాల యూనిట్లు పెంచి ఆర్థికంగా సహాయపడాలని సిర్పూర్(యు) మండల మైనార్టీ సంఘం మండలాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ అన్నారు. బుధవారం మైనార్టీ నాయకులతో కలిసి సిర్పూర్(యు) ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పట్నుండి మైనార్టీలకు తొలిసారి రుణాలు అందిస్తున్నట్టు గుర్తు చేశారు. 2021 జనగణన ప్రకారం సిర్పూర్(యు) మండలానికి కేవలం ఒకే ఒక యూనిట్ మంజూరు చేయడం సిగ్గుచేటన్నారు. మండల వ్యాప్తంగా ఒకటే యూనిట్ రావడంతో మండలంలోని మైనార్టీ యువతి, యువకులకు రుణాలను ఎంపికచేయడంతో ఎంతో ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 200 మంది దరఖాస్తులు చేసుకోగా అందులో ఒకే యూనిట్ రావడం బాధాకరమన్నారు. మండలంలో కనీసం 10 యూనిట్లు పెంచాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ ఆరీఫ్, ఇమ్రాన్‌ఖాన్, షేక్ అమీర్, యూనిస్‌ఖాన్, అక్తర్‌ఖాన్, అబీల్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

14న వాహనాలకు వేలం

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన 7 ద్విచక్రవాహనాలు, ఒక సుమో, ఆటో రిక్షాలకు ఈ నెల 14న వేలం నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ విజేందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుస్టేషన్ ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ప్రభుత్వ నిర్ణీత ధరావత్తు సొమ్మును చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు.

అనుదినం జనహృదయం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
గురువారం 09 మార్చి 2023

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-కుభీర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్‌కు చెందిన సల్ల సుజాత(38) మహిళ ఆదివారం భర్తతో పాటు ఇద్దరు పిల్లలతో కలిసి చాత గ్రామానికి వెళ్లారు. దీంతో సోమవారం అక్కడి నుంచి కుభీర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా పార్డి(బి) గ్రామ సమీపంలో ఒక్కసారిగా వెనుక కూర్చున్న సుజాత ఒక్కసారిగా ఎగిరికింద పడటంతో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో వెంటనే భైంసా ఆస్పత్రికి తరలించి, అక్కడి వైద్యులు సూచన మేరకు నిజామాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతి చెందిన తల్లి వార్త వినగానే ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు రోదనలు మిన్నంటాయి. మృతురాలికి భర్త, ఉన్నాడు.

బీరయ్య దేవాలయ అభివృద్ధికి రూ.3లక్షల విరాళం

నవతెలంగాణ- ఖానాపూర్



ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామంలో జరుగుతున్న బీరయ్య దేవుని పట్నాల పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీకి రూ.3 లక్షల విరాళానికి సంబంధించిన ప్రొసీడింగ్‌ను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల ప్రజా ప్రతినిధులు, తర్లపాడ్ గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-కడెం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చిన్నయ్య వీఆర్ఏ పద్మను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. అటు కుటుంబ బాధ్యతలను, ఇటు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, సమాజంలో చాలా కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మహిళల హక్కులకు ప్రాధాన్యతనిస్తూ వారి పట్ల గౌరవ మర్యాదలతో మెలగాలని సూచించారు. మహిళలు వారికి కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో రాణిస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతాలు సృష్టించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేష్ నాయక్, జూనియర్ అసిస్టెంట్ ఫకీర, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలో మహిళ దినోత్సవ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళ సిబ్బందితో కలిసి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ హజరయ్యారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే రేఖా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తోటి తోటి మహిళామణులందరికీ మున్సిపల్ సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళ మున్సిపల్ కార్మికులకు ఘనంగా శాలువాతో సన్మానించారు. మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై చిన్నారులు చేసిన నృత్యాల చూసి ఆస్వాదించారు. అక్కడే ఉన్న పాఠశాల మహిళ సిబ్బందితో కలిసి మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. పీఆర్టీయూ భవన్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : చదువుతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అందుకే మగ పిల్లలు, ఆడపిల్లలు అనే తేడా చూపకుండా పిల్లలు అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు తల్లులందరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రణీత అన్నారు. ఈ సందర్భంగా బుధవారం టీయూటీఎఫ్ జిల్లా శాఖ తరపున సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు డీఈఓ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. మహిళలు ఇప్పటికే పలు రంగాల్లో రాణిస్తున్నప్పటికి రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు డీఈఓను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం, రాష్ట్ర సహాధ్యక్షులు


కడెంలో...

ఆర్.సుజాత, అరుణ, అంజనాదేవి, జిల్లా అధ్యక్షులు యస్.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.లంధర్ రెడ్డి, ఉపాధ్యాయురాలు మీనాక్షి, అరుణ, పుష్పలత, శిల్పా, లలిత, లత, కిరణ్ బాల, సరిత, అంజనాదేవి ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ జగ్‌రామ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య ద్వారా మహిళలు అభివృద్ధిని సాధించవచ్చని తెలియజేశారు.

మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపన్యాస, క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు ప్రిన్సిపల్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ. డి.దయాకర్, మహిళా అధ్యాపకులు పుష్పలత, ఇమ్రాన యాస్మిన్, ఆర్.సంతోష్ కుమార్, కే.రఘునాథ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉన్నారు.


ఆదిలాబాద్‌టౌలో...


లక్ష్మణచాందలో...


ఖానాపూర్‌లో...

మనువాదాన్ని తిప్పి కొట్టి స్త్రీ, పురుష సమానత్వానికి పోరాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

స్త్రీవిద్య, ఉద్యోగ, వివాహ, జీవన విషయాలపై పితృస్వామిక కఠినతరం చేస్తున్న మనువాద విధానాలను సమైక్యంగా ఎదుర్కోవాలని, స్త్రీ, పురుష సమానత్వానికి సమైక్యంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి అన్నారు. బుధవారం స్థానిక బంగారిగూడలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ నాయకురాలు బి.అశ్విని అధ్యక్షతన ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని మహిళలు ఎంపిక చేసుకునే స్వేచ్చను సమర్థించడానికి విస్తరించడానికీ పోరాటాన్ని తీవ్రతరం చేయాలని అన్నారు. సామ్రాజ్యవాద, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మిక, రైతాంగ, యువత పోరాటాలన్నింటికి సంఘీభావం తెలుపాలని అన్నారు. పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని అన్నారు. వివిధ ప్రజాస్వామిక పోరాటాలలో ఉన్న మహిళల మధ్య ఐక్యత కోసం కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ పాలనకు



వ్యతిరేకంగా ప్రజాస్వామిక అవకాశాలను రక్షించుకోవడానికి పోరాటాలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. సామ్రాజ్యవాదం, పితృస్వామ్యాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా పోరాడుతున్న మహిళలకు సంఘీభావంగా 2023 మార్చి 8 సందర్భంగా విస్తృతంగా మహిళా హక్కుల రక్షణకు ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, బి.వెంకట నారాయణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు శ్రీలత, సానియా, సుజాత, శిరీష, గంగామణి పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సు కోసమే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే బాపురావు

నవతెలంగాణ-గుడిహత్నూర్



పేదల శ్రేయస్సు కోసమే సీఎం కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ. వేల కోట్ల నిధులను సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. కేసీఆర్ కిట్, అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం, మహిళల సంరక్షణ కోసం షీటీమ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్రంలో మహిళలు ఎంతో సంతోషంగా జీవనం గడుపుతున్నారని అన్నారు. మహిళలంతా సమైక్యంగా ఉంటూ మహిళా సాధికారిత సాధించాలని అన్నారు. అంతకు ముందు చెక్కులు తిసుకోవడానికి వచ్చిన మహిళలకు మహిళల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు తిరుమల్ గౌడ్, సర్పంచ్‌లు సునీత జాదవ్, దస్రు పటేల్, లింగు, మాడావి ధనలక్ష్మి, ఎంపీటీసీలు షగీర్ ఖాన్, జ్ఞాను కేంద్రే, బీఆర్ఎస్ కన్వీనర్ కరాడ్ బ్రహ్మనంద్, జాదవ్ రమేష్, అరుగుల సంతోష్ గౌడ్, పాటిల్ రాందాస్, రాహుల్ ఉన్నారు.

పెర్సాపేన్ నూతన ఆలయానికి భూమిపూజ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని బలాన్‌పూర్ గ్రామంలో కోవ వారి పెర్సాపేన్ నూతన ఆలయానికి బుధవారం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మెన్ కోవ లక్ష్మి సోనేరావు దంపతులు ప్రత్యేక పూజా చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలు పాటిస్తూ, భావితరానికి సంస్కృతి సాంప్రదాయాలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు దేవరావ్, సర్పంచ్ ఆత్రం పరమేశ్వర్, మాజీ ఎంపీటీసీ శంభు, భీంరావు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన మహిళలుగా తీర్చి దిద్దేందుకే ఆరోగ్య మహిళ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆరోగ్య సమస్యలు ప్రారంభదశలో ఉన్నపుడే వైద్య సేవలు పొందాలని, ఆరోగ్యవంతమైన మహిళలుగా తీర్చి దిద్దేందుకు ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహూల్ రాజ్ పీఎస్ అన్నారు. బుధవారం స్థానిక హమాలీవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మంగళవారం ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గ పరిధిలో ప్రత్యేకంగా కేటాయించబడిన పీహెచ్‌సీలలో ప్రత్యేకంగా మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు, సేవలను మహిళా వైద్యురాలు, మహిళా సిబ్బందిచే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ప్రారంభదశలో ఉన్నపుడే వైద్య సేవలు పొందాలని అన్నారు. రానున్న కాలంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెడికేటెడ్‌గా ఉచితంగా గుండె, కిడ్నీ, రక్తహీనత, మహిళలకు సంబంధించిన సమస్యలకు వైద్య సేవలు అందిస్తారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అవసరమైన పక్షంలో రెఫరల్ ఆస్పత్రికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందని అన్నారు. విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఆస్తులు, అంతస్తుల కంటె ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యం పట్ల ఉషారుగా ఉండాలని అన్నారు. మహిళల ఆరోగ్యం కోసం సీఎం ఆరోగ్య మహిళ



కార్యక్రమాన్ని ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. చిన్న రోగం పెద్దగై ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని, అందుకే సమీప ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాలని తెలిపారు. మహిళా వైద్య సిబ్బందిచే సేవలు అందిస్తారని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద 8 రకాల సేవలు అందిస్తారని ఎమ్మెల్యే వివరించారు. ట్రైనీ సహాయ కలెక్టర్ డా.పి.శ్రీజ మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలకైనా వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి మాట్లాడుతూ మహిళల కోసం ప్రారంభించిన కార్యక్రమాన్ని ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, మున్సిపల్ కమీషనర్ శైలజ, వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు, స్థానిక కౌన్సిలర్స్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, వైద్యులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో శిక్షణ ఐఏఎస్‌లు

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో బుధవారం వివిధ రాష్ట్రాల కేడర్లకు చెందిన శిక్షణ ఐఏఎస్‌లు బుధవారం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ అధికారులు అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో శిక్షణ ఐఏఎస్‌లచే ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమార్చన పూజ జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆలయ అధికారులు వీరిని శాలువాతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి చరిత్ర ఆలయ విశిష్టతను వీరికి వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మనఊరు మనబడి పనుల్లో వేగం పెంచాలి

నవతెలంగాణ-నార్నూర్



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మౌలిక వసతులను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనఊరు మనబడి పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. బుధవారం తాడిహత్నూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా ఈ నెల 20 గడువులోగా పనులు పూర్తి చేయాలనీ ప్రధానోపాధ్యాయుడు గణేష్‌ను ఆదేశించారు. వారి వెంట వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, జామడ సర్పంచ్ ముక్తా రుపదేవ్ గుత్తేదారులు ఉన్నారు.

ఏడు రోజుల్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ-భైంసా

ముధోల్ మండలంలోని ముద్గల్ గ్రామంలో జరిగిన చోరీ కేసును ముధోల్ పోలీసులు ఏడు రోజుల్లో ఛేదించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ వివరాలను వెల్లడించారు. ముద్గల్ గ్రామానికి చెందిన టోక్రేకర్ లత గత నెల 21న తనభర్తకు చికిత్స నిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఇంటికి తాళం ఉన్న విషయాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన టోక్రేకర్ శుద్ధోధన్ మార్చి 1న రాత్రి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ఇనుప పెట్టె పగులగొట్టి అందులో దాచిపెట్టిన రూ.1.20లక్షలు తీసుకెళ్లాడు. తర్వాత రోజు బాధితురాలికి విషయం గ్రామస్తులు చెప్పడంతో వెంటనే హైదరాబాద్ నుండి వచ్చి బాధితురాలు ముధోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా, నిందితుడు దొంగిలించిన డబ్బు తన ఇంట్లో దాచిపెట్టి మహారాష్ట్రలోని నందాలో తన అత్తగారి ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు. బుధవారం ఉదయం మండలంలోని సరస్వతి నగర్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసిన విషయాన్ని, నింధితుడు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చోరీ కేసును ఏడు రోజుల్లో ఛేదించిన ఎస్సై తిరుపతి ఏఎస్సై సుదర్శన్, సిబ్బంది యాకత్, లస్మరెడ్డి, అర్జున్‌లు వారం రోజుల్లో చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించటంతో, అడిషినల్ ఎస్పీ ఎస్సైతో పాటు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో ముధోల్ సీఐ వినోద్ రెడ్డి, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

నేడు టీఎస్ కాస్ట్, న్యాక్ సంస్థలతో ఆర్జీయూకేటీ అవగాహనా ఒప్పందం

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ, టీఎస్ కాస్ట్, న్యాక్ సంస్థలతో గురువారం అవగాహనా ఒప్పందం చేసుకుంటామని యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అరణ్య భవనంలో అటవీ, దేవదాయ, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ వెంకటరమణ, డాక్టర్ రజత్ కుమార్ ఐఏఎస్ సమక్షంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్ కాస్ట్) మెంబర్ సెక్రటరీ మారుపాక నగేష్ పాల్గొనున్నారని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అధ్యాపకులకు, విద్యార్థులకు పరిశోధన, ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్, ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో పరస్పర సహకారాలు అందిపుచ్చుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. దీంతో పాటు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ)తో అవగాహన ఒప్పందం జరుతుందని పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందం వల్ల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు, అధ్యాపకులకు మెరుగైన అవకాశాలు లభించే అవకాశాలు ఉంటాయని డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ షురూ..



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం గ్రామీణ కూలీలకు వ్యవసాయ అనుబంధ పనులతో పాటు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆరంభించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. వీరి అవీనితిని అరికట్టి అక్రమాలకు పాల్పడిన ఈజీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సోషల్ ఆడిట్‌ను నిర్వహిస్తోంది. దానిలో భాగంగానే ఇంద్రవెల్లి మండలానికి 14 మంది డీఆర్పీలతో కూడిన ఆడిట్ టీమ్ వచ్చేసింది. వీరికి బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో నవంబర్ 2019 నుండి 2022 మార్చి వరకు అనగా మొత్తం రూ.26 కోట్ల పనులకు సామాజిక తనిఖీ చేయనున్నారు. దాదాపుగా మూడు సంవత్సరాల పనులకు సామాజిక తనిఖీ చేయనుంది. ఈ పనులకు సబంధించిన రికార్డులను అనేక మంది టీఏలు తనీఖీ బృందానికి సమర్పించలేదని బుధవారం జరిగిన సమీక్షలో పేర్కొన్నారు. తప్పకుండా తనిఖీ బృందానికి ఎంబీతో పాటు ఇతర రికార్డులను సాయంత్రంలోపు అందజేయాలని ఎంపీడీఓ సూచించారు. లేనిచో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



నవతెలంగాణ-కుభీర్

విద్యార్థులు వార్షిక పరీక్షలో మంచి ఉత్తీర్ణత సాధించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.సునీల్ కుమార్ అన్నారు. బుధవారం మండలకేంద్రమైన కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఎంతో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అదే విధంగా వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, కళాశాలకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు, మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అక్కట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హన్మంత్ రావు, సంపత్, శేఖర్, విజయ్, భాస్కర్, రమేష్ నర్సయ్య, శ్రీనివాస్ రావు, నరేందర్, రాజేందర్, శివరాజ్, లింగయ్య, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

10న రవన్న ఏడో వర్ధంతి సభ

నవతెలంగాణ-ఖానాపూర్

రవన్న అలియాస్ రాయల సుభాష్ చంద్రబోస్ ఏడో వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య అన్నారు. బుధవారం ఖానాపూర్ విశ్రాంతిభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి అమరుడైన రవన్న వర్ధంతి మార్చి 10వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే 7వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. దేశంలోఎన్నో పోరాటాలతో త్యాగాలతో ప్రజాస్వామ్యంలో హక్కులు ఆవిష్కరించబడ్డాయని అన్నారు. రాచరికాలు పోయి రిపబ్లిక్‌లు ఏర్పడ్డాయని అన్నారు. నేడు బీజేపీ ఫాసిస్టు పాలనలో 73 ఏండ్లు తర్వాత భారత రాజ్యాంగంలో ఆమోదించబడ్డ కొద్దిపాటి హక్కులు కూడా నేడు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజల్లో అసమానతలతో పాటు అన్నిరంగాల్లో సంక్షోభాలు ఎదురవుతున్నాయని, దాని మాటున మతోన్మాదం, కుల రక్కసి కట్టలు తెంచుకొని ప్రజలపై స్వైర విహారం చేస్తుందని ఆరోపించారు. రవన్న వర్ధంతి సభ సందర్భంగా, ఫాసిస్టు విధానాలపై, మేధావులచే ఉపన్యాసాలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో ఖానాపూర్ సబ్ డివిజన్ నాయకులు జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య డి.సుదర్శన్, అడ్డగట్ల శంకర్, కురుమ రాజన్న, మచ్చ శ్రీనివాస్, భూక్యా రవి, గోనె లచ్చన్న, వినోద్, రాజేష్, బలరాం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రజల్లోకి బీజేపీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల్లోకి వెళ్తున్నారు. గత నెలలో బజార్‌హత్నూర్ మండలం మాంజ్ర గ్రామంలో వారం రోజుల పాటు జరిగిన భగవత కథ పారాయణం ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన దేవకినందన్ ఠాకూర్ మహారాజ్‌ను ఇంద్రవెల్లి మండలానికి ఆహ్వానించారు. ఆ రోజున మండల కేంద్రంలో పెద్ద ఎత్తున కలశ, రోహణ, శోభ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ హాజరయ్యారు. బీజేపీ నుంచి ఆ పార్టీ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ హాజరయ్యారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. ఇలా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, శుభ కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజలతో మమేకమవుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-తాండూర్

క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ అన్నారు. బుధవారం తాండూర్ సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శ్రీగణేష్ మండలి కమిటీ, మిత్రబృందం ఆధ్వర్యంలో కన్నం మణి స్మారక క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక క్రీడలతో ప్రేమ పూరితమైన స్నేహ బంధాలు ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. యువత చెడు అలవాట్లకు, వ్యసనాలకు బానిస కాకుండా క్రీడా నైపుణ్యత శక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. గెలుపొందిన అచలాపూర్ భూమేష్ టీంకు రూ.12 వేల నగదు, బహుమతి ప్రదానం చేశారు. విన్నర్‌గా నిలిచిన బోయపల్లి సాయి టీంకు రూ.8వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బానయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, తన్నీరు బుచ్చయ్య, చందు, యువకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని తలోడి గ్రామానికి చెందిన మర్రి మల్లేష్‌కు రూ.30 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదరికంలో ఉన్న మల్లేష్, ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని వైద్య ఖర్చుల నిమిత్తమై సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారుడికి ఆర్థిక సాయం అందిందని అన్నారు. కార్యక్రమంలో కౌటాల ఉప సర్పంచ్ వసునూరి తిరుపతి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, మధూకర్, బాపు, సంతోష్, రాంచందర్ పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళా సర్పంచ్‌లకు సన్మానం



నవతెలంగాణ-కౌటాల

మహిళా దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని ఆదివాసీ కమ్యూనిటీ భవనంలో ఆదివాసీ సర్పంచ్‌లకు, మహిళా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా సర్పంచ్ మడావి రేణుక మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఆడవాళ్ల వంటింటికే పరిమితం కాకుండా, మగవారితో సమానంగా అన్ని హక్కులను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉపాధ్యాయులు, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిపై కేసు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని కన్నెపెల్లి గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై ప్రవీణ్‌కుమార్ అక్కడకు వెళ్లి వారిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుండి రెండు కోళ్లు, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామానికి చెందిన మీసాల శ్రీనివాస్(35) బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం మద్యం తాగి వచ్చి, భార్య సంగీతతో గొడవ పడ్డాడు. దీంతో బుధవారం ఉదయం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం శ్రీనివాస్ తన తమ్ముడి కొడుకు సాత్విక్‌కు నేను ఉరేసుకొని చనిపోతున్నానని, మీ పెద్దమ్మకు విషయం చెప్పమన్నాడు. దీంతో సాత్విక్ తన నానమ్మ వెంకుబాయికి విషయం చెప్పగా వెంటనే ఇంటికెళ్లి చూసేసరికి ఇంటిలోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి వెంకుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శ్రీరాముల అనూష, అశోక్ విద్యార్థులకు వారి సాయంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలను రాబట్టి తల్లిదండ్రులకు, పాఠశాలకు, మండలానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్త రమేష్, జాగృతి మండలాధ్యక్షురాలు చంద్రకళ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ రాంచంద్ర నాయక్, ముత్తంపేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నానాజీ, ఉపాధ్యాయులు జయరాం, రాజాబాబు, హరీష్, సీఆర్పీలు దేవన్న, లాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. పీఆర్టీయూటీఎస్, కాగజ్‌నగర్ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు చేయూతనందించి, ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేయాలని అన్నారు. బాల్యవివాహాల నిరోధానికి మహిళా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనప్ప సతీమణి రమాదేవి, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఎటుకూరి శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షులు ఎనగంటి భిక్షపతి, సభ్యులు రతన్‌జైన్, పత్తిపాక శ్రావణ్‌కుమార్, గడ్డం భిక్షపతి, సాంబశివరావు, గంగాభవాని, సమత, సుజాత, వరలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో...

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి విద్యావతితో పాటు మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమోద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి యు.నారాయణ, నాయకులు కలికోట రమణయ్య, వాహబ్, దేవయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని మహిళా అధ్యాపకులను సన్మానించారు. మహిళా దినోత్సవంపై ప్రత్యేక క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డి.లక్ష్మీనరసింహ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ రాజు, అధ్యాపకులు ఎం రాజేశ్వర్, డి.జనార్ధన్, ఏమాజీ, దేవేందర్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్

















నవతెలంగాణ- మంచిర్యాల

మహిళతోనే సృష్టి మనుగడ జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి మైనారిటీ ఫంక్షన్ హాల్ వరకు తలపెట్టిన ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై వివక్షత లేకుండా అన్ని రంగాలలో వారిని ప్రోత్సహించాలని తెలిపారు. కుటుంబాన్ని తీర్చిదిద్దడం నుండి దేశ అభివృద్ధిలో ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని, అన్ని రంగాలలో వారికి సముచిత స్థానం కల్పిస్తే దేశం తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తుందన్నారు. రాష్ట్రపతి, గవర్నర్, ప్రధాని, న్యాయ మూర్తులు, రాజకీయం రంగాలలో మహిళలు ఉన్నత స్థానంలో ఉన్నారని, వారిని మరింత ప్రోత్సహిస్తే దేశాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్తారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూ భద్రత కల్పిస్తుందన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న మహిళ ఉద్యోగినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, మున్సిపల్ చైర్మెన్ పెంట రాజయ్య, సంబంధిత శాఖల అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

కెరమెరి:సమాజంలో మహిళల పాత్ర చాలా గొప్పదని అదనపు కలెక్టర్ చహత్ బాజ్‌పాయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళదినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. చెల్లిగా, భార్యగా, కూతురుగా తను పోషించే పాత్రలు ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని తెలిపారు. కుటుంబం కోసమే పరితపించే మహిళల త్యాగాన్ని వెలకట్టలేమని అన్నారు. సమాజంలో ఆడపిల్లలని చిన్న చూపుచూస్తూ చూడటం సరికాదని అన్నారు. పురుషాధిక్యత కలిగిన ఈ సమాజంలో తను ఎప్పుడు వెనుకబడుతూనే ఉందని, పురుషులతో సమానంగా పోటీ తత్వాన్ని మహిళలు అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం పీఆర్టీయూటీఎస్ సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మెన్ కోవ లక్ష్మి, పీఆర్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్, మండల అధ్యక్షులు జి.భరత్ రావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అజయ్, మండల మహిళా ప్రధాన కార్యదర్శి విమల, మండల అసోసియేట్ ప్రెసిడెంట్ శివప్రసాద్, టేకం భాస్కర్, సీనియర్ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

దహెగాం:సమాజంలో మహిళల పాత్ర ఎంతో ఉందని, మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో మహిళా వైద్యశాలలను జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వంద ఉమెన్స్ క్లీనిక్‌లను ప్రారంభించిందని అన్నారు. కుమురంభీం జిల్లాలోని దహెగాం, గిన్నెదరిలో ఏర్పాటు చేశామని అన్నారు.



ఇందులో మహిళలకు సంబంధించిన 8 రకాల వ్యాధులకు చికిత్సలు అందుబాటులో ఉంటాయని అన్నారు. చికిత్స స్థానికంగా నయం కాకపోతే జిల్లాకేంద్రానికి పంపిస్తామని అన్నారు. అక్కడ కూడా నయం కాకుంటే హైదరాబాద్‌కు పంపిస్తామన్నారు. జిల్లాలో మెడికల్ కళాశాలతో పాటు కాగజ్‌నగర్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటుచేసిందని తెలియజేశారు. ఈ నెల 25వ తేదీ నుండి సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. గర్భిణీలకు న్యూట్రీషన్ కిట్టు అందజేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. పేదలకు ఆడబిడ్డ బరువు కాకూడదనే ఉద్యేశంతో కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ పథకాన్ని ప్రారంభించి ఆర్థిక సాయం అందిస్తోందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 36 జిల్లాలో ఆరోగ్యపరంగా కుమురం భీం జిల్లా రెండో వరుసలో ఉందని అన్నారు. ఇందుకు గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది కృషి చేశారని పేర్కొన్నారు. మహిళా వైద్యశాల పురోగతి ఆధారంగా జిల్లావ్యాప్తంగా మరిన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు.

వడ్డీ లేని రుణాలు పంపిణీ...

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన వడ్డీ లేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే కోనప్ప, జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే అందజేశారు. 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరానికి గాను వడ్డీ లేని రుణాలను మండలంలో 360 సంఘాలకు రూ.20.36 లక్షల చెక్కులను వారికి అందజేశారు. అదేవిధంగా 15 సంఘాలకుగాను బ్యాంకు లింకేజీ రుణాలు రూ.75 లక్షల చెక్కులను గ్రూపు మహిళలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ కాసం శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రామకృష్ణ, డీఆర్డీఓ సురేందర్, అడిషనల్ డీఎంహెచ్ఓ సీతారాం, ఎంపీపీ కంబగోని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు, వైద్యాధికారిని స్పందన, సర్పంచ్ పుష్పాలత లక్ష్మి, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, వైద్యసిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో బుధవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను క్యాతనపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, వైస్ చైర్మెన్ సాగర్‌రెడ్డిలు మహిళలకు బహుమతులు ప్రదానం చేసి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జ్ గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, బోయినపల్లి అనిల్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్:పాలకులు మహిళల హక్కులను కాలరాస్తూ, తాత్కాలిక సంతోషం కోసం మహిళా దినోత్సవాలను నిర్వహిస్తున్నారని ఎంఎస్పీ నాయకుడు న్యాయవాది రజిహైదర్ ఆరోపించారు. కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో 50శాతం మహిళలకు చట్టసభల్లో ఆ స్థాయిలో రిజర్వేషన్ లేకపోవడం వారిని అవమానించడమేనని అన్నారు. చట్టసభలతో పాటు ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులలో ఎక్కువగా శక్తివంతమైన వాటిలో మహిళలను నియమించాలని డిమాండ్ చేశారు. అలా వారికి గౌరవం ఇచ్చినప్పుడే నిజమైన మహిళా సాధికారిత సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా కనీసం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంటి తుడుపు చర్యగా చేస్తున్న మహిళా దినోత్సవాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని మహిళలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్‌బాబు, న్యాయవాదులు కౌరు, శ్యామ్‌రావు, కిషోర్, చంద్రకుమార్ పాల్గొన్నారు.





భూకబ్జాదారుల నుంచి కాపాడాలి

● సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చెరువులను, ప్రభుత్వ భూములను, కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న చెరువులను, అధికార పార్టీ నాయకులు కబ్జాలు చేసి, అమ్ముకోవడం జరుగుతుందని అన్నారు. దీనివలన భవిష్యత్తులో సాగు భూములకు నీరందే అవకాశం లేకుండా పోతోందని అన్నారు. కబ్జాల విషయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖ శ్యామ్ నాయక్ స్పందిస్తూ కబ్జాదారులు ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని చేపుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. మీ మాటల్లో నిజాయితీ ఉంటే చెరువులు, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిని పార్టీ నుంచి బహిష్కరించి, చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో ఇంటి స్థలం లేక, వేలాదిమంది సొంత ఇల్లు లేక ప్రభుత్వం ఇస్తామని చెప్పిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే జిల్లా అధికారులు జోక్యం చేసుకొని చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడాలని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కనికరపు అశోక్, మండల నాయకులు కే.లింగన్న, ఎం.జయ, అబ్దుల్లా, పోతు విజయ, ఒడిపెల్లి అంజన్న, మగ్గిడి విజయ, మల్లేశ్వరి, అనూష, మౌనిక పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



భారతదేశ సంస్కృతి, నాటి నుండి నేటి వరకు, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాటి సంఘం సంస్కర్తలు ఎన్నో పోరాటాలు చేసి పురుషులతో సమానంగా సమానత్వం పొందేలా సంఘ సంస్కర్తలు కృషి చేశారని జూనియర్ సివిల్ జడ్జీ రవి అన్నారు. బుధవారం జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో కృషి చేసిన మహిళలను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలే సమాజాభివృద్ధికి కీలకపాత్ర అని, మహిళలు కుటుంబంలో వారి బాధ్యతను నెరవేర్చడం వల్లనే మనం ఈస్థాయిలో ఉన్నామని అన్నారు. మహిళలకు ఉన్న ఓపిక వెలకట్టలేమని అన్నారు. శరీరకంగా కంటే మానసికంగా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నారని అన్నారు. దీనిని గుర్తించి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. అలాగే న్యాయవ్యవస్థలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలియజేశారు. వీటిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించి, వారిని గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కిశోర్‌కుమార్, రైస్‌హైమద్, శంకర్, గణపతి, కళ్యాణ్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 09 మార్చి 2023

కాలిపోయిన శనగ పంటకు నష్టపరిహారం అందించాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



శనగ పంట కాలిబూడిదై నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం మండలంలోని పిప్రి గ్రామంలో దగ్ధమైన శనగ పంటను పరిశీలించారు. గ్రామానికి చెందిన యాళ్ల గంగయ్య రైతు పంట చేనులోని శనగ కుప్ప కాలిపోయిందని అన్నారు. రైతు వివరాలను, తనకున్న మూడు ఎకరాలలో రబీలో వేసిన శనగ పంట పరిశీలించి, రైతు వివరాలను నమోదు చేయడం జరిగిందని అన్నారు. దాదాపుగా పంట దిగుబడి 25క్వింటళ్ల శనగ పంట కాలిబూడిదైందని అన్నారు. దాదాపుగా రూ.లక్ష 30వేల వరకు వచ్చే ఆదాయాన్ని కోల్పోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జక్కా మల్యాన్న, రాజారెడ్డి, రాజు, గంగయ్య రైతులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని నీల్వాయి గ్రామానికి చెందిన చొప్పదండి మల్లక్క కూతురు లక్ష్మి వివాహ ఖర్చులకు రూ.5000, 50కిలోల బియ్యం నీల్వాయి ఎంపీటీసి రుద్రభట్ల సంతోష్ కుమార్, నీల్వాయి సర్పంచ్ గాలి మధు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఓడిల రాజన్న, నాయకులు పూర్ణచందర్‌రెడ్డి, ఇరుగం జగన్, చెన్నూరి పురుషోత్తం, నెండుగురి మధుసూధన్, ఆవులమారి పున్నం, చెన్నూరి చెందు, ఎడ్ల మధునయ్య, శ్రీరాముల రమేశ్, మంత్రి రమేశ్, జాడి మధునయ్య, మంత్రి రాజన్న, వేమునూరి బాపురెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-జైపూర్

పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రాజ్యాంగంలో మహిళల కోసం పొందుపర్చిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లైంగిక వేధింపులు, గృహ హింస వంటివి నివారించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, సేవలు అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. సర్పంచ్ కుంటాల సౌజన్య ఆధ్వర్యంలో ఎంపీపీ గోదారి రమాదేవి, వార్డు సభ్యులు నేండుగురి రజిత, భీమిని రాజ్యలక్ష్మి, రామటెంకి రమాదేవి, ఏఎన్ఎం జంగపల్లి రాణి, ఆశా కార్యకర్త గడ్డం తిరుమల, అంగన్వాడీ కార్యకర్త అంకం సరోజన, దుట నిరోషా, పెరుమాండ్ల లావణ్య తదితరులను శాలువాలతో సన్మానించారు.



జైపూర్‌లో...

రామకృష్ణాపూర్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఆర్‌కె సిహెచ్‌పి గని పై టీబీజికెఎస్ మందమర్రి వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్, రీజినల్ సెక్రెటరీ రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణలో అభివృద్ధిలో ముందుకు వెళ్తున్న సంస్థలలో సింగరేణి ఉందని, కెసిఆర్ చొరవతో సింగరేణిలో మహిళలకు కూడా స్థానం కలిగిందని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రవేశ పెట్టిన కారణ్య నియామకం ఆదేశాల ద్వారా ఇప్పటి వరకు 537 మహిళలకు ఉద్యోగ అవకాశం కల్పించామని తెలిపారు. అనంతరం మహిళా కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రెటరీ దుగ్గిరాల శంకర్‌రావు, మోహన్, కొమురయ్య, నరేందర్, పత్తి రాజిరెడ్డి, కె. శ్రీనివాస్, పాముల మొగిలి పాల్గొన్నారు.

తవక్కల్ ఉపాధ్యాయునిలకు సన్మానం

పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయునిలను సన్మానించారు. మహిళల గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మంచిర్యాల : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లను మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జ్ఞాపికలను అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ అధ్యక్షురాలు సురేఖ సూచనల మేరకు కాంగ్రెస్ మహిళా నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ రామగిరి భానేశ్, బిసి సెల్ జిల్లా చైర్మన్ వడ్డే రాజమౌళి, నాయకులు పూదరి ప్రభాకర్, చుక్కయ్య పాల్గొన్నారు.

నస్పూర్ : మున్సిపాలిటీ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ పారిశుధ్య మహిళా కార్మికులను, మెప్మా ఆర్పి, ఏఎల్ఎఫ్, టీఎల్ఎఫ్‌లను శాలువాలతో సత్కరించారు. మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు కింద రూ.2,69,32,285 చెక్కు పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు పాటల పోటీలు, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్, కో-ఆప్షన్స్ సభ్యులు, మున్సిపల్ ఆర్‌ఓకె సతీష్, మెప్మా టిఎంసి నాగరాజు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలోనూ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం నర్సయ్య భవన్‌లో మండల అధ్యక్షురాలు ఉమా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు వంటింటికే పరిమితం కాకుండా మగవారితో సమానంగా ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ లైంగిక దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు నిర్భయ లాంటి చట్టాలను కఠినతరం చేసినా దేశంలో మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల కార్యదర్శి విజయ, జిల్లా సహాయ కార్యదర్శి లింగం జమున, ఉపాధ్యక్షురాలు బియ్యాల భవానీ, కలవెన శారద, సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, మహిళా నాయకురాలు పద్మ, సమీరా, కవిత మంజుల పాల్గొన్నారు.

కెరమెరి : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జడ్పి చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్ర కీలకమైందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడి రాణించి, ప్రత్యేక గుర్తింపు పొందాలని సూచించారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి, రాజకీయాల్లో సైతం రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళకు రాజకీయాల్లో ప్రాధాన్యతను కల్పించిందన్నారు. ఆర్థికంగా ఎదిగి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ప్రత్యేకాధికారి ఆడే ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక నాయకులు ఇనూస్, బషీర్ పాల్గొన్నారు.

నార్నూర్ : స్త్రీని దేవతగా శక్తిగా పూజించే సంస్కృతి మనదని వైస్ ఎంపిపి చంద్రశేఖర్ అన్నారు. బుదవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలను మహిళ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ రమేష్‌తో కలిసి శాలువాతో సన్మానించారు. ప్రతి ఒక్కరూ స్త్రీలను గౌరవించాలన్నారు. మహిళలు ప్రతి రంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శి రాజశేఖర్, కారోబారి దినేష్, ఏఎన్ఎం సింధు, సుశీల, అంగన్వాడీలు పంచపూల, పంచశీల, సావిత్రి, శ్యామక, ఛాయ, మాయ, ఆశాలు సంగీత, అనిత, సుశీల హెచ్‌ఏ ఈశ్వర్ పాల్గొన్నారు.

తాంసి : మహిళలను గౌరవించడం మన సంప్రదాయంగా భావించాలని న్యాయ సేవా సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర దేశంలో నేటికీ మారుమూల గ్రామాల్లో చాలా మందికి చట్టాలు, రాజ్యాంగ అంశాలు తెలియక మోసపోతున్నారన్నారు. అలాంటి వారిని చైతన్య పరచటమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. సంస్థ ద్వారా పేదలకు ఉచితంగా న్యాయ సేవలందించడం జరుగుతుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింబాజీ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అశోక్, అసిస్టెంట్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్, మండల వైద్యాధికారి డా.విజయసారథి, ఏపీఎం ప్రసాద్, సీసీలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళ మోర్చా నాయకులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు సమున్నత స్థానం కల్పించబడినది, ప్రపంచ దేశాల్లో మహిళలకు రెండవ స్థానం కల్పించాయన్నారు. స్వాతంత్ర్య పోరాటం మొదలుపెట్టింది ఒక మహిళ ఝాన్సీ లక్ష్మీబాయి అని తెలిపారు. కార్యక్రమంలో మహిళ మోర్చా నాయకులు జ్యోతి, సునందరెడ్డి, పద్మ రాణి, గంగామణి, లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుభీర్ : మహిళలు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషించాలని మండల కో ఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్ అన్నారు. మండలంలోని గోడపూర్, పార్డి-బి, పల్సి, సోనారి, కాస్రా గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కో ఆప్షన్ సభ్యుడు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత కల్పించి అన్ని రంగాల్లో ముందుండేలా చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రిలియన్స్ ఫౌండేషన్ ప్రతినిధి దేవురావు, సాయినాథ్, మానస రమేష్, వనిత అమూల్ పాల్గొన్నారు.



మంచిర్యాల కాంగ్రెస్ ఆధ్వర్యంలో...



కుభీర్‌లో...



కెరమెరిలో...

జాతీయ రహదారి నిర్మాణ పనులకు సహకరించాలి



నవతెలంగాణ-జైపూర్

63 నెంబర్ జాతీయ రహదారి నిర్మాణ పనులకు స్థానికులు సహకరించాలని శ్రీరాంపూర్ సీఐ రాజు తెలిపారు. ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఎస్సై ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ డీఈ అన్నయ్య, ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. కాలక్రమేణ రహదారుల విస్తరణ కొనసాగుతున్నందున నిర్మాణ పనులకు ఎలాంటి అవరోధం కల్పించొద్దని సూచించారు. మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నందున వ్యాపారులు, గృహ యజమానులు అభ్యంతరం చెప్పవద్దని కోరారు. రోడ్డుపైన వాహనాలు నిలుపరాదని, రహదారి మీదుగా రాకపోకల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఫోర్ వేగా మారిన రహదారిలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపినా, రాకపోకలు సాగించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ రాజమల్లు, ఎంపీటీసీ లింగస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బలమూరి అరవిందరావు, మధుకాన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు కలిసిరావాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, అన్యాక్రాంతం కాకుండా చూడడానికి చేయి చేయి కలిపి నడవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాల్లో చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడటానికి పార్టీలకు అతీతంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. దానికోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా భీమయ్య, కో కన్వీనర్‌గా సుతారి వినయ్‌కుమార్, సిటీమల భరత్‌కుమార్, దాముఖ కరుణాకర్, ముత్యం రాజన్న, దాసరి తిరుపతి, కొండపల్లి మహేష్, కండ్ల శ్రావణ్, గవ్వల శ్రీకాంత్, మున్వర్ అలీ ఖాన్, సిర్పూర్ గోపాల్‌ను ఎన్నుకున్నారు.

శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని కొనియాడారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న మహిళా డాక్టర్లకు, ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజారాం, పీఏసీఎస్ చైర్మెన్ వెంకన్న, ఎంపీపీ జయశ్రీ, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ తిరుమల, యువజన సంఘం అధ్యక్షులు డబ్బుల శేఖర్, నాయకులు నిస్తె కైలాష్, అందే ప్రకాష్, సాయి చైతన్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహిళలు లేకుంటే సృష్టి లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు లేకుంటే సృష్టే లేదని, మహిళలు సగభాగమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక తానిషా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సృష్టిలో మహిళల పాత్ర ముఖ్యమైందని అన్నారు. నేటి సమాజంలో మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో, వివిధ కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్నారని అన్నారు. మహిళా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు పరుస్తుందని అన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి సహకరిస్తే విజయవంతం అవుతాయని అన్నారు. ఏ రాష్ట్రంలో లేనటువంటి వేతనాలు తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశలకు ఇస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ సమాజంలో ప్రతి కుటుంబం నుండి మార్పు రావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. కట్టుబాట్లు, వివక్షత ఆడపిల్లలపై ఉండవద్దని అన్నారు. ఆడ, మగ పిల్లలపై వ్యత్యాసం ఉండకూడదని అన్నారు. ప్రతి కుటుంబంలో మంచి విషయాలు వారి పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలని అన్నారు. జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలను నిర్వహిస్తే సంబంధిత తల్లిదండ్రులు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారికీ మాత్రమే వివాహాలు చేయాలని అన్నారు. అర్హత లేని వారికీ కళ్యాణ లక్ష్మి మంజూరు చేయకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, మున్సిపల్ కమీషనర్ శైలజ, తాంసి జెడ్పీటీసీ రాజు, స్థానిక కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుభీర్ మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జూమ్డ గ్రామానికి చెందిన తులసిరాం సింగ్(60) బుధవారం చోండి గ్రామ శివారు ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తులసిరాం సింగ్ ఈ నెల 22న సాయంత్రం చోండి గ్రామంలో తన బంధువైన ఠాకూర్ భగవాన్ సింగ్ కుమార్తె పెండ్లి వెళ్లాడు. పెండ్లి తరువాత రోజు ఉదయం 10 గంటల నుంచి మృతుడు కనిపించకపోవడంతో కుమారుడైన గోవింద్ సింగ్ తండ్రి కనిపించడం లేదని పిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తుండగా తులసిరాం పెద్ద కుమారుడైన భజరంగ్ సింగ్ గత కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయిన బాధతో జీవితంపై విరక్తి చెంది. బుధవారం చోండి గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలి

నవతెలంగాణ-తాండూర్

మహిళలు స్వశక్తితో ముందుకు సాగినప్పుడే రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం తాండూర్‌లో ఏర్పాటు చేసిన వడ్డీ రాయితీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అన్నారు. స్త్రీలు తన నిర్మాణాత్మకమైన ఆలోచనలు అమలు పర్చడంలో పరిణతి చెంది కుటుంబ ఆర్థిక వ్యవస్థను పెంపొందించుకోవాలని అన్నారు. దీంతో సామాజిక ఆర్థిక అంశాలలో దూరం తగ్గి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. స్త్రీ నాయకత్వం వహించే కుటుంబం పొదుపు పథంలో పయనిస్తుందని తెలిపారు. ప్రభుత్వం మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళలు భాగస్వామ్యం పద్ధతిలో కుటీర పరిశ్రమలు నెలకొల్పి, లబ్ధి పొందాలని అన్నారు. మహిళల అభివృద్ధికి రక్షణకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందని తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి తోడ్పాటు నందిస్తుందని అన్నారు. ప్రభుత్వం బాలికలు అన్ని రంగాల్లో రాణించే విధంగా కస్తూర్బావంటి గురుకులాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. వారు ఉన్నత చదువులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్ అందిస్తోందని అన్నారు. బాలికల రక్షణ కోసం షీటీంలను ఏర్పాటు చేసిందని తెలిపారు. గ్రామైక్య సంఘాలు సమిష్టి వ్యాపారాలు నిర్వహించి, అభివృద్ధిలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, శిక్షణ కలెక్టర్ గౌతమి, ఎంపీపీ ప్రణయ్, జెడ్పీటీసీ బానయ్య, వైస్ ఎంపీపీ దాగం నారాయణ, ఎంపీటీసీ శంకర్, పెర్క రజిత, మసాడి శ్రీదేవి, మొగిలి శంకర్, సర్పంచ్ దాగం శంకరమ్మ, గాజుల బక్కమ్మ, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు దత్తాత్రేయ రావు, కోఆప్షన్ సభ్యులు రహెమత్ ఖాన్, గ్రామ అధ్యక్షులు సాగర్, డీఆర్డీఓ శేషాద్రి, ఏపీఓ పూమా నాయక్, విజయలక్ష్మి, తాండూర్ తహసీల్దార్ కవిత, అధికారులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

నవతెలంగాణ - మంచిర్యాల

క్రీడా రంగంలో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. బొలిశెట్టి హనుమంత్ పటేల్ క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవం బుధవారం సాయంత్రం జరిగింది. విజేతలుగా మంచిర్యాల కింగ్స్ జట్టు రూ.60 వేల క్యాష్ ప్రైజ్, రన్నర్స్ డాక్టర్ చరణ్ జట్టుకు రూ.30 వేల క్యాష్ ప్రైజ్ అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య హాజరై బహుమతులు అందజేశారు. క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత కిషన్, డిసిసిబి డైరెక్టర్ ఎర్రం తిరుపతి, కౌన్సిలర్లు హరికృష్ణ, పోరెడి రాజు, మాజీ కౌన్సిలర్లు తోట తిరుపతి, పల్ల రాజన్న, నాయకులు పెంట ప్రదీప్, గంగన్న, ఓఎంఎస్‌సి క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి బోలిషెట్టి కిషన్, ఎర్రం ప్రభాకర్, సభ్యులు అంబ్రోస్ రమేష్ యాదవ్, సతీష్‌గౌడ్, ఎలుక శ్రీనివాస్, వైభవ్, అశోక్, రాజేష్ అయ్యగారు, పానుగంటి చందు, తుమ్మ ప్రభాకర్, బోలిశెట్టి ప్రశాంత్, బోయిని శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో రాణిస్తున్న పాత మంచిర్యాల క్రీడాకారులను సన్మానించారు.

మహిళల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

నవతెలంగాణ - జైనూర్

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. బుధవారం ప్రపంచ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భారతి గ్రామర్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాళ్లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఐటీడీఏ జీసీసీ ఆపరేటర్ సేవలకు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆత్రం శంకర్, ఎస్ఐ మధూకర్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి కింద అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా రాణించడానికి 50 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చి గౌరవించాలన్నారు. స్త్రీ లేకపోతే మానవ సమాజం లేదని, సమాజంలో స్త్రీలను ప్రతి ఒక్కరు గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, స్థానిక సర్పంచ్ మెస్రం, భారతి గ్రామర్ పాఠశాల కరస్పాండెంట్ నరేందర్, జైనూర్ ఎస్ఐ మధూకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కనక గంగారాం, విద్యార్థి సంఘం నాయకులు కుడిమెత విశ్వనాథ్, ఉయిక చందన్‌షావ్, ఏఎస్ఐ మిర్జా, మహిళలు పాల్గొన్నారు.